వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.73 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,73,610 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అతిసార వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిసార వ్యాధి వ్యాప్తి చెందకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండలాల వారీగా ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, వైద్యాధికారులతో డయేరియా నియంత్రణ చర్యలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో అతిసార కేసులు నమోదు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్, పైపులైన్ల లీకేజీలు వంటివి లేకుండా చూసుకుని సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ఆహార కల్తీ నియంత్రణ చర్యలపై అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహించే ప్రచార కార్యక్రమంపై సూచనలు చేశారు. అతిసార వ్యాధి నమోదైన కేసులకు సత్వర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆదిసారం వ్యాప్తి చెందకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అతిసార కేసులు నమోదైనచోట మూలాలను గుర్తించి సత్వర చర్యలుతీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్ల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి అవసరమైనచోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో డయేరియా కేసులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎక్కడైనా పైపులైను లీకేజీలను గుర్తిస్తే వెంటనే ఎంపీడీవోల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నూరు శాతం సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీల కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు విస్తృతంగా పర్యటించి అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీఐవో సత్యనారాయణ, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీపీవో డి.రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, డీఈవో ఎం.కమలకుమారి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు పూర్తిస్థాయిలో నీరందిస్తాం

అల్లవరం, జూన్ 25: ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బోడసకుర్రు వద్ద బెండా కాల్వపై రూ.కోటితో నిర్మిస్తున్న వంతెన పనులను, సాగునీటి సరఫరాను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, కాల్వలో గుర్రపుడెక్క, తూడు వంటి అడ్డంకులను తొలగిస్తామన్నారు. ఏటిగట్టు నిర్మాణ పనులను పరిశీలించారు. బోడసకుర్రు బెండా కాల్వపై వంతెన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేస్తున్న పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ అభినందించారు. బెండా కాల్వలో సాగునీటి సమస్యపై స్పందనలో కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించింది. బ్రిడ్జి పనులు పూర్తయిన వెంటనే క్రాస్‌బండ్లు తొలగించాలని ఆదేశించారు. రామేశ్వరం మొగ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, పంచాయతీరాజ్ ఈఈ చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి వున్నారు.

సొసైటీల పగ్గాలెవరికో!

- రోళ్లపాలెం మినహా 163 పాలకవర్గాల రాజీనామా
- ప్రాథమిక సహకార సంఘాల పదవులపై అధికార పార్టీ నాయకుల్లో ఆశలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు



రైతులు మాత్రమే ఉండే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎన్నికలు జరిగి ఎనిమిదేళ్లు గడిచింది. అప్పటి నుంచీ ప్రత్యేక అధికారులు, ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలతో నడుస్తున్నాయి. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుతో గత వైసీపీ ప్రభుత్వం నియమించిన పాలక వర్గాల సభ్యులను రాజీనామా చేయాలని ప్రభుత్వం కోరింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 166 ప్రాథమిక సహకార సంఘాలకు గాను గత ప్రభుత్వం 164 సంఘాలకు త్రిసభ్య కమిటీని నియమించింది. అమలాపురం రూరల్ రోళ్లపాలెం మినహా మిగిలిన అన్ని పాలకవర్గాల త్రిసభ్య కమిటీల సభ్యులు రాజీనామా చేశారు.

అలమూరు, జూన్ 25: జిల్లావ్యాప్తంగా సహకార సంఘాలు ప్రస్తుతం అధికారుల అధ్వర్యంలో నడుస్తున్నాయి. 2018, 2019 సంవత్సరాల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకార సంఘాలకు పాలకవర్గాల స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే 2019 జూలై నెలలో వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక అధికారులను తొలగించి వైసీపీ నాయకులతో త్రిసభ్య కమిటీలను నియమించి నడిపించింది. ముఖ్యంగా సహకార సంఘాల అధ్వర్యంలో నడిచే ధాన్యం కొనుగోలు, ఎరువులు, విత్తనాలు వంటి వ్యాపారం తగ్గించి వాటిని రైతు భరోసా కేంద్రాలకు మళ్లించారు. ప్రస్తుతం అనేక సహకార సంఘాలు కేవలం రైతులకు పంట రుణాలు అందించి వాటిని వసూలు చేయడమే ప్రధానంగా వ్యాపారం సాగిస్తున్నారు.

గత ప్రభుత్వం మాదిరిగానే కమిటీలను నియమిస్తే పదవులు లభిస్తాయని ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమిలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గాలతో రాజీనామా చేయించడంతో ఖాళీగా ఉండడంతో వాటిపై వాలేందుకు సిద్ధంగా వున్నారు. ఇప్పట్లో మండల, జడ్పీ, సర్పంచ్ ఎన్నికలు ఉండవు కాబట్టి చాలా కాలంగా స్థానిక పదవులు లేక ఖాళీగా ఉన్న అనేక మంది నాయకులు ఈ పదవులనైనా దక్కించుకోవాలనే ఆశతో ఉన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకంపై ప్రభుత్వం దృష్టి?

సహకార సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. కొద్దికాలం పాటు ప్రత్యేక అధికారులను నియమించి సహకార సంఘాలను గాడిలో పెట్టాలని అడుగులు వేస్తున్నట్టు భావిస్తున్నారు. ఆరు నెలలు గడిచిన తర్వాత ఎన్నికలు జరిపించడమా.. లేక పాలక వర్గాలను నియమించడమా అనే దానిపై స్పష్టతకు రానున్నట్టు తెలుస్తోంది.

ఉత్తమ విస్తరణాధికారి అవార్డుకు కొండయ్య ఎంపిక



అంబాజీపేట, జూన్ 25: హైబ్రీడ్ వంగడాలను వృద్ధి చేయడంతో పాటు కొబ్బరిలో నాణ్యమైన మొక్కల తయారీకి నిరంతరం కృషి చేసినందుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తున్న పీఎం కొండయ్య ఉత్తమ విస్తరణ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ఉద్యానవన విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ ఆయనకు అవార్డు అందజేస్తారు. కొండయ్యను చలపతిరావుతో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరటీ, సిబ్బంది అభినందించారు.

ఎమ్మెల్యే బండారు ఇంట అభిమానుల కోలాహలం



బండారు సత్యానందరావును సన్మానించిన పంచాయతీ పారిశుధ్య కార్మికులు

కొత్తపేట, జూన్ 25: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించి ప్రమాణస్వీకారం అనంతరం బండారు సత్యానందరావు మంగళవారం స్వగ్రామమైన వాడపాలెం చేరుకున్నారు. అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన ఇంటి వద్ద సందడి నెలకొంది. బండారును కలిసి అభినందనలు తెలిపేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి అభిమానులు, నాయకులు విచ్చేశారు. ఇందులో భాగంగా రావులపాలేనికి చెందిన పారిశుధ్య కార్మికులు సత్యానందరావును కలిసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి వేతనాలు పెంచాలని వారు వేడుకున్నారు. న్యాయం చేస్తానని బండారు వారికి హామీ ఇచ్చారు.

కూరగాయల ధరల నియంత్రణపై సమగ్ర నివేదిక

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్



అమలాపురం టౌన్, జూన్ 25: పెరిగిన కూరగాయల ధరల నియంత్రణపై సమగ్ర నివేదిక రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ సూచించారు. సరఫరాదారులను గుర్తించి రైతులకు లాభసాటిగా, వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు అందించే ప్రయత్నం చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జేసీ అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జిల్లా ధరల మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కూరగాయలు సాగుచేసే రైతుల సమాచారాన్ని ఉద్యానవన శాఖ నుంచి జిల్లాలోని రైతులు ఉత్పత్తి చేసే కూరగాయల లభ్యతపై దృష్టి సారించాలన్నారు. కూరగాయలను డ్వాక్రా సంఘాలు, ఎస్టేట్ ఆఫీసర్ల ద్వారా రైతుల నుంచి సేకరించి రైతు బజార్లలో విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయల ధరలను నియంత్రించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. టమోటా ధరల పెరుగుదల నేపథ్యంలో రైతు బజార్ల ఎస్టేట్ ఆఫీసర్ల ద్వారా ఇండెంట్ తీసుకుని చిత్తూరు జిల్లా మదనపల్లి మార్కెట్ యార్డు నుంచి దిగుమతి చేసుకోవాలనానరు. ప్రజలకు ఒక్కొక్కరికీ కిలో చొప్పున నో లాస్.. నో ప్రాఫిట్ విధానంపై టమోటా విక్రయాలు జరపాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్‌వినయ్, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతుబజార్ ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలి

జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు



కొత్తపేట, జూన్ 25: రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకావం ఉన్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు పరిశుభ్రంగా అందించేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు కోరారు. మంగళవారం ఆయన కొత్తపేట, వానపల్లి, వాడపాలెంల్లో పారిశుధ్యం, రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. కార్యదర్శులకు, సర్పంచ్‌లకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అవసరమైన బ్లీచింగ్, ముగ్గు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సీజన్లో శుభ్రమైన రక్షిత మంచినీటి పంపిణీకి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీపీవో వెంట కొత్తపేట, వానపల్లి, వాడపాలెం సర్పంచ్‌లు బూసి జయలక్ష్మిభాస్కరరావు, పల్లి భీమారావు, త్సామా బాబు, ఈవోపీఆర్డీ డి.సుబ్బారావు, పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి వేగుళ్ల వెంకటరామన్ వున్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జూన్25: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు అమలాపురానికి చెందిన చెక్క శ్రీలక్ష్మి రూ.10వేలు విరాళాన్నిమంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందించారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. మురమళ్ల భద్రకాళీ వీరేశ్వరస్వామి నిత్య కల్యాణాలకు జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ఆన్‌లైన్ కోటా విడుదల చేసినట్టు ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి



కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మామిడికుదురు, జూన్ 25: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి సూచించారు. మామిడికుదురులోని విద్యావనరుల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పీహెచ్‌సీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. సీడీపీవో విజయశ్రీ, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, డిప్యూటీ తహసీల్దార్ కె.శరణ్య, మండల పరిషత్ ఏవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

కపిలేశ్వరపురం, జూన్ 25: అంగర పీహెచ్‌సీలో మంగళవారం డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వరకు జరిగే కార్యక్రమాలపై పీహెచ్ పరిధిలోని అన్ని గ్రామాల వైద్య, ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బందికి డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. డయేరియా వ్యాప్తిని అరికట్టుట, తీసుకోవల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, క్లోరినేషన్ నీటిని తాగుట తదితర అంశాలపై వివరించారు. ఎంపీహెచ్‌ఈవో జె.మల్లికార్జునుడు, హెచ్.బి.రామారావు, హెచ్‌వి టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య ఆశ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, జూన్ 25: డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జీవీ సరోవర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ బి.మమత, వైద్యాధికారులు శ్రీనివాస్, ఇంద్రావతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయవరం, జూన్25: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మాచవరం పీహెచ్‌సీ వైద్యులు ఎం.శ్రీనివాస్, మణికంఠ పిలుపునిచ్చారు. మంగళవారం మాచవరం పీహెచ్‌సీ వద్ద ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ వర్షకాలంలో డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిలక్ష్మమ్మ జాతర, తీర్థం







ముమ్మిడివరం: ఆదిలక్ష్మమ్మ, కపిలేశ్వరపురం: వేంకటేశ్వరస్వామికి పాలాభిషేకం, యానాం: పిల్లారాయస్వామి

ముమ్మిడివరం, జూన్ 25: అయినాపురంలో శ్రీఆదిలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థం వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. మంగళవారం అమ్మవారి తీర్థం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల18న ప్రారంభమైన జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి.

వైభవంగా శ్రీమాణిక్యాలమ్మ అమ్మవారి తీర్థం

అయినవిల్లి, జూన్ 25: యలకల్లంక గ్రామదేవత శ్రీమాణిక్యాలమ్మ అమ్మవారి జాతర, తీర్థం మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జాతర మహోత్సవం గరగ నృత్యాలతో నిర్వహించారు. మంగళవారం తీర్థం జరిగింది. అమ్మవారికి గండర దీపాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు గ్రామ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పిల్లారాయ ఆలయంలో లక్ష గరిక పూజ

యానాం, జూన్ 25: యానాం ఉన్న పిల్లారాయ స్వామి ఆలయంలో అర్చకులు మానేపల్లి వీరభద్రశర్మ నేతృత్వంలో లక్ష గరిక పూజ ఘనంగా నిర్వహించారు. మంగళవారం కృష్ణాంగారక చతుర్థి, సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని స్వామివారికి లక్ష గరికపూజ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, 108లీటర్ల ఆవు పాలు, తదితర విశేష ద్రవ్యాలతో అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, జూన్ 25: అంగరలో వేంచేసి ఉన్న శ్రీగోదాదేవి సమేత శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలబాలాజీ ఆధ్వ ర్యంలో స్వామివార్కి పాలాభిషేకం తదితర పూజలను వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివార్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అయినవిల్లి, జూన్ 25: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక అన్నదాన ట్రస్టుకు రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత రాయుడు రమణమూర్తి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రూ.50వేలు విరాళం అందజేశారు. దాతకు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం

అంబాజీపేట, జూన్25: తొండవరం గ్రామదేవత శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం మంగళవారం నిర్వహించారు. అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించి పూజ ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవార్కి మొక్కులు తీర్చుకున్నారు. 29నఅమ్మ వారి జలకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అంతర్వేది, జూన్ 25: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పాలెపు బేబి అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు రూ.58వేలు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన ఐవీ కృష్ణమూర్తి, లక్ష్మణరావు రూ.40వేలు విరాళంగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు దాతలు తెలిపారు. విరాళ దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, కిరణ్, అన్నదానం స్వామి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రాజోలు, జూన్ 25: ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని తాటిపాక పీహెచ్‌సీ కమిటీ చైర్మన్, ఎంపీపీ కేతా శ్రీను అన్నారు. తాటిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం డాక్టర్ ఫణికిరణ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మట్టా శైలజ, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎం.శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 25: బుధవారం ఉదయం 11నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రయాణికులు సూచనలు, సలహాలు, సమస్యలు సెల్ (9959225536)కు తెలపాలన్నారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి రేపు పరీక్ష

ముమ్మిడివరం, జూన్ 25: గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయడానికి ఈనెల27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాణేలంక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10గంటలకు పాఠశాల ఆవరణలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థినులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం జిరాక్సు కాపీలను తీసుకురావాలని సూచించారు.

28న జాబ్‌మేళా

ముమ్మిడివరం, జూన్ 25: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల28న రావులపాలెం సంహిత డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. రావులపాలెంలో ఉన్న లూమిరైస్ కంపెనీలో వందకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఉన్న యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఐసీఎస్‌టీపీకు సంబంధించి ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు ఐదు రోజులు శిక్షణ ఇస్తారన్నారు. బీ.టెక్, డిప్లమో, ఐటీఐ, ఏదైనా డిగ్రీ అభ్యర్థులు అర్హులన్నారు. విద్యార్థులు బయోడేటా, ఆధార్, ఐడీ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లుతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు రాజేంద్ర 8247645389ను సంప్రదించాలన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్25: రామచంద్రపురం మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు అధికసంఖ్యలో పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా సహకరించాలన్నారు.

విద్యార్థుల చేరికలు పెంచాలి

కె.గంగవరం, జూన్ 25: పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం డీవైఈవో నరసింహ ఫణి అన్నారు. మంగళవారం కూళ్ల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిచారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్ఎం కె.వి.వి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు చిట్టూరి రామ్మోహన్, నంబూ శ్రీను, వాసంశెట్టి సత్యనారాయణ మూర్తి, పెద్దు సరోజినీదేవి, బొక్కా శ్రీను పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు

మండపేట, జూన్ 25: మండపేట నియోజవర్గంలో ఎన్నడు లేనివిధంగా శిలాఫలకాలు ధ్వం సం చేయడం బాదాకరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శిలాఫలకాల ధ్వంసం వెనుక కుట్ర ఉందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులను పట్టుకుని శిక్షించాలని పోలీసులను ఆదేశించామన్నారు.

మండపేట చాంబర్ ఎన్నిక అప్రజాస్వామ్యం

మండపేట, జూన్ 25: మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నిక అప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర రావు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడు మండపేటలో చాంబర్ మారటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను అధికార పార్టీ చాంబర్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని పార్టీల పెద్దలు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి చాంబర్ ఎన్నిక నిర్వహించాలన్నారు. ఇదే కొనసాగితే మండపేట చాంబర్‌లో కాంగ్రెస్ నుంచి పోటీపెట్టి చీలిక తెచ్చేందుకు వెనుకాడబోనని కామన హెచ్చరించారు.

డ్రైన్ పైపునకు మరమ్మతులు

మలికిపురం, జూన్25: పాతతహసీల్దార్ కార్యాలయం నుంచి మలికిపురం సెంటర్‌లో కలిసే డ్రైన్ పైపు శిథిలమై గాంధీ బొమ్మ సెంటర్‌లో మురికినీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. సర్పంచ్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యదర్శి మరమ్మతులు చేయించారు.



ఎమర్జెన్సీ డేకు వ్యతిరేకంగా కాగడాల ప్రదర్శన

అమలాపురం టౌన్, జూన్ 25: బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటరామ్మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఎమర్జెన్సీ డేకు వ్యతిరేకంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని ఆ పార్టీ కార్యాలయం నుంచి కాగడాల ప్రదర్శన చేపట్టారు. సంఘ కార్యాలయంలో కాంగ్రెస్ ఎమర్జెన్సీ సమయంలో విద్యార్థి దశలో ఉండి జైలుపాలైన ముక్కామల వెంకటశాస్త్రి, ఎస్.నాగరాజారావు, వల్లూరి విజయానందపార్థసారధి, పెదమల్లు సత్యానందం, దొంగ విజయ్‌కుమార్‌లకు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు, యాళ్ల దొరబాబు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో చెరుకూరి గోపాలకృష్ణ, గొలకోటి వెంకటరెడ్డి, అడబాల సత్యనారాయణ, పాలూరి సత్యానందం, మోకా వెంకటసుబ్బారావు, దూరి రాజేష్, ఆకుమర్తి బేబిరాణి, యనమదల రాజ్యలక్ష్మి, కొండేటి ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నాయకుల కాగడాల ప్రదర్శన

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 25: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో, రామచంద్రపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.వి.ఎస్.ఎస్. ఫణికుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రత్నంపేట పురపాలక సంఘ ఉన్నత పాఠ శాలలో 8,9,10 తరగతుల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం విత్తనాల సుబ్బారావు, ఉపాధ్యాయులు డి.వి.వి.సత్యనారాయణ, దుర్గాప్రసాద్, శ్రీదేవి పాల్గొన్నారు. బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఆనందరావు జన్మదిన వేడుకలు

అమలాపురంరూరల్, జూన్25: ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలను ఒకరోజు ముందుగానే రోళ్లపాలెం చిట్టిగరువు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. కారెం ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు,పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కేక్‌కట్ చేశారు.బడుగు రామారావు, నూటుకుర్తి చంటి, మెరమళ్ల శివ, రాయుడు రమణ, మోటూరి వెంకటేశ్వరరావు, రంకిరెడ్డి తాతాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యానాం, జూన్ 25: స్థానిక గోపాల్ నగర్‌లో నిర్మిస్తున్న ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ పనులు, పలు చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. వ్యవసాయశాఖ నుంచి వివిధ శాఖలకు భూ బాదాలయింపు అంశాలపై అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి, ప్రజాపనుల శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు అభినందనలు

మండపేట, జూన్ 25: ఎమ్మెల్యే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మంగళవారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు కుటుంబ సభ్యులు వేగుళ్లను కలిసి అభినందించారు 44కిలోల కేక్‌ను వేగుళ్లతో కట్ చేయించిన అభిమానులు కార్యకర్తలకు పంచారు. వెదురుపాక, అంగర సర్పంచ్‌లు మేడింటి సూరారెడ్డి, వాసా కోటేశ్వరరావు వేగుళ్లను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే మండపేట ఎన్‌జీవో సంఘ నాయకులు, ఉద్యోగులు ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి అభినందించారు.

ఎమ్మెల్యే గిడ్డిని కలిసిన బీజేపీ నేతలు

అల్లవరం, జూన్ 25: పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, చెరుకూరి గోపాలకృష్ణ, సుంకర సాయి, గనిశెట్టి వెంకటేశ్వరరావు, గిడుగు భాస్కరరావులు ఎమ్మెల్యే గిడ్డిని సన్మానించారు.

ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతి అందిస్తున్న డ్రైవర్లు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 25: కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు మంగళవారం కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. సస్పెండ్‌కు గురైన కె.వెంకటేశ్వర్లును తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, గోకవరం డిపోకు బదిలీ చేసిన కాకినాడ డిపో డ్రైవర్‌ను తిరిగి రప్పించాలని, 17 నెలలు నుంచి సస్పెండ్‌లో ఉన్న డ్రైవర్ డి.శ్రీనును విధుల్లోకి రప్పించాలని, యూటీఎఫ్ టీమ్ మిషన్ రాక చేస్తున్న అక్రమ బదిలీలు ఆపాలని, కాకినాడ నుంచి విజయవాడ డ్యూటీలకు కనీసం 8గంటలు రెస్టులు ఉండాలని, రన్నింగ్ టైమ్ పెంచి ఓటి ఇప్పించాలని, బస్సులు డ్యామేజీకి గురైతే తమ జీతాలకు కోత విధిస్తున్నారని, ప్రస్తుత డీపీటీవో, డిపో మేనేజర్ వచ్చాక 15మంది సస్పెండ్ అయ్యారని వారిని విధుల్లోకి తీసుకోవాలని, లింకు డ్యూటీలు చేసే విధానం తీసేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

'హైస్కూల్ అనుమతులు రద్దు'

తాళ్లరేవు, జూన్ 25: సుంకరపాలెం శ్రీ విద్యాలయ ప్రైవేటు ఇంగ్లీషుమీడియం హైస్కూల్‌కు ప్రభుత్వం అనుమతులు రద్దు చేసినట్టు ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆ పాఠశాలలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠశాల నిర్వహించడానికి లీజుడీడ్ లేనందున ఆర్జేడీ ఆదేశాల మేరకు రద్దు చేసినట్టు తెలిపారు. కరస్పాండెంట్‌కు నోటీసులు జారీచేసినా స్పందించలేదని, అందుకే పాఠశాలకు వచ్చి అనుమతిని రద్దు చేసినట్టు నోటీసు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మంగాయమ్మ, సీఆర్‌పీ కాశి శ్రీనివాస్, కరస్పాండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'కర్రా'కు అంతర్జాతీయ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు

అమలాపురం రూరల్, జూన్ 25: న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ వేదిక్ ఆస్ట్రాలజీ స్నాతకోత్సవంలో పేరూరు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన కర్రా వీరభద్రంజ్యోతిష భీష్మ బిరుదుతో పాటు ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. జోతిషం, మంత్ర శాస్త్రం, వాస్తులో వీరభద్రం చేసిన కృషికి ఈ అవార్డును అందజేశారు.

స్పెషల్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



ఆత్రేయపురం, జూన్ 25: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6,800 స్పెషల్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని యూఎస్‌టీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మెర్ల నాగ సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన అమరావతిలో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చర్యలు చేపడతానని లోకేశ్ హామీ ఇచ్చినట్టు సత్యనారాయణ చెప్పారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

మలికిపురం, జూన్ 25: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నేత దేవ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. కూలీలు వలస వెళ్లకుండా యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు సాధించిన ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మంగళవారం దిండిలో ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం పెంచాలని, పని దినాలను 200కు పెంచాలని, వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గెడ్డం ప్రభాకరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నల్లి బుజ్జిబాబు, దేవ సురేష్, రవిప్రసాద్ పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకారం

రాజోలు, జూన్ 25: విశాఖపట్నం అఖిల భారత అవయవ శరీర దాన సంఘానికి మరణానంతరం అవయవాలను దానం చేస్తామని రాజోలుకు చెందిన బొంబే కట్ పీసెస్ అధినేత కొత్త శ్రీనివాసరావు-నాగవెంకటపద్మావతి దంపతులు ప్రకటించారు. ఈసందర్భంగా రాజోలులో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, మహిళా సంఘ అధ్యక్షురాలు కాసు భవానీ మంగళవారం శ్రీనివాసరావు దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజా నాగరత్నకుమార్, లక్కింశెట్టి బాలాజీ, కాసు శ్రీనివాసరంగనాయకమూర్తి వి.బద్రి, చలువాది త్రినాథ్, వి.భ్రమరాంబ, గెల్లి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అంబాజీపేట, జూన్ 25: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో మోకా ప్రకాష్ సూచించారు. కె.పెదపూడి శివారు నందెపువారిపాలెం ఎంపీపీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం

అంతర్వేది, జూన్ 25: నేను బడికి పోతా ర్యాలీ కార్యక్రమాన్ని సఖినేటిపల్లిలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి సమగ్రశిక్ష జిల్లా అధికారి సీఎంవోటీ సుబ్రహ్మణ్యం, ఎండీపీవో కేవీ సత్యనారాయణ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎంఈవోలు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఉన్న ప్రతీ ఇంటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో అంటూ పిల్లలతో పాటు తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 12వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందని మండల విద్యాశాఖ అధికారులు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు అన్నారు.

పిల్లలంతా బడిలో ఉండాలి

మలికిపురం, జూన్ 25: పడమటిపాలెంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, అందరూ చదవాలి, అందరూ ఎదగాలి, నేను బడికి పోతామంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శ్రీనివాస్, భైరవమూర్తి, శ్రీనివాస్, నాగదేవి, మురళీ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేను బడికి పోతా ర్యాలీ

ఐ.పోలవరం, జూన్ 25: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మురమళ్లలో మంగళవారం నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. బడి బయట పిల్లలుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో కొండారెడ్డి తిరుమలరావు, పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సూర్యబలిజ సంఘ అధ్యక్షుడిగా రామకృష్ణ

అమలాపురంటౌన్, జూన్25: సూర్యబలిజ సంఘ అధ్యక్షునిగా భాస్కర్ల రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అమలాపురం సూర్యబలిజ వీధిలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.సంఘానికి రామకృష్ణ చేస్తున్న సేవలను గుర్తించి అధ్యక్షునిగా ఎన్నుకున్నట్టు సంఘ పెద్దలు మద్దుల నాగేశ్వరరావు, మద్దుల గోపాలకృష్ణ, ధరణికోట శ్రీనివాసరావు తెలిపారు.నాయకులు కాశే విశ్వనాథం, యండమూరి సత్తిబాబు, పందిరి శ్రీనివాస్, యండమూరి శ్రీనివాస్, సరిదే వెంకటేష్ పాల్గొన్నారు.







కొబ్బరి చెట్టు వివాదంపై కేసులు నమోదు

మామిడికుదురు, జూన్ 25: నగరం గ్రామానికి చెందిన వెలిగట్ల సూర్యకుమారి, వెలిగట్ల విజయలక్ష్మిలు భూమి సరిహద్దులో గల కొబ్బరి చెట్టు విషయంలో గొడవపడి గాయాలతో ఆసుపత్రిలో చేరారు. వారు ఇచ్చిన ఫిర్యాదులతో ఇరు వర్గాలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

మూలస్థానం వీఆర్వో రాజేశ్వరి మృతి



ఆలమూరు, జూన్ 25: మూలస్థానం అగ్రహారం వీఆర్వో కప్పల రాజేశ్వరి(48) మంగళవారం మృతి చెందింది. అనారోగ్యంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. బడుగువానిలంకకు చెందిన రాజేశ్వరి ఆ గ్రామ వీఆర్ఏగా పనిచేసేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పదోన్నతి లభించింది. మూలస్థానం అగ్రహారం వీఆర్వోగా నియమించినప్పటి నుంచీ అక్కడే పనిచేస్తున్నారు. రాజేశ్వరి మృతికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు సంతాపం తెలిపారు.

డ్రగ్స్ రహిత ఏపీ లక్ష్యానికి కృషిచేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 25: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు, జీవితం నాశనం అవుతుందని డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యానికి అందరూ సహకరించాలని రామచంద్రపురం సీఐ కె.దొరరాజు అన్నారు. మంగళవారం వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మోడరన్ విద్యాసంస్థలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు సహాయం

కాట్రేనికోన, జూన్25: గెద్దనపల్లికి చెందిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు కృష్ణా జిల్లా కృత్తివెన్నులో ఈనెల14న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షల వంతున సహాయం విడుదలయ్యింది. మంగళవారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి బాధిత కుటుంబాలకు చెక్కులు అందించారు.

రేపటి నుంచి మొక్కల పంపిణీ


అంబాజీపేట, జూన్ 25: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఈనెల27 నుంచి కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే మొక్కలను పంపిణీ చేస్తామన్నారు.





ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 26 జూన్ 2024
cinema@andhrajyothy.com

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచానాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్మాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.

శ్రీవారికి తలనీలాలు సమర్పించిన
గాయని సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



నేతాజీ మార్గంలో నేను

'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.

సెప్టెంబర్‌లో ఎమర్జెన్సీ



బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ ఇందిరా గాంధీ పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. గతేడాదే చిత్రీకరణ పూర్తయింది. పలుమార్లు విడుదల తేదీని ప్రకటించినా ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేకపోయారు. తాజాగా చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. సెప్టెంబర్ 6న 'ఎమర్జెన్సీ' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఇందిరాగాంధీ పాత్రలో కంగన లుక్ ఆకట్టుకుంది. 'మణికర్ణిక' చిత్రం తర్వాత కంగన దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. మాజీ ప్రధాని వాజ్‌పాయ్ పాత్రలో శ్రేయస్ తల్పడే, జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్ కనిపించనున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కంగనా రనౌత్ మధ్య ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

- బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

ఆయ్.. ఆగస్టులో వస్తున్నామండీ



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన 'ఆయ్' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రముఖ సంస్థ జీఏ 2 పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాతో అంజి కె మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నారు. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా ఇప్పటికే అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు బన్నీ వాసు, విద్యా కొప్పినీడి మాట్లాడుతూ 'ఆగస్టు 15 గురువారం. ఆ తర్వాత రోజు నుంచి వీకెండ్ మొదలవుతుంది. ఇక సోమవారం రక్షా బంధన్. అందుకే ఆ డేట్‌ను ఎన్నుకున్నాం. గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో నార్నే నితిన్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు' అని చెప్పారు. అల్లు అరవింద్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిర్యాల, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.



అరవై ఏళ్ల అద్భుత చరిత్ర కలిగిన సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ రెండేళ్ల గ్యాప్ తర్వాత అందిస్తున్న చిత్రం '35.. చిన్న కథ కాదు'. ఇటువంటి ఆసక్తికరమైన టైటిల్‌తో న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, తమిళ దర్శకుడు భాగ్యరాజా ముఖ్య పాత్రలు పోషించారు. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్

న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా

యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా రూపుదిద్దుకున్న ఈ క్లీన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, ఫొటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటింగ్: టీసీ ప్రసన్న.

కలయిక కుదిరిందా?

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ హిట్ చిత్రాలతో టాప్ కథానాయికగా ఎదిగారు రష్మిక మందన్న. అక్కడి అగ్ర దర్శకులు, నిర్మాతల నుంచి హీరోయిన్‌గా అవకాశాలు వెల్లువెత్తుతున్నా ఆమె మాత్రం ఆచి తూచి సినిమాలను ఎంచుకుంటున్నారు. అయితే రష్మిక ఓ కొత్త ప్రాజెక్ట్‌కు 'ఎస్' చెప్పారని ప్రస్తుతం బాలీవుడ్‌లో వినిపిస్తోంది. 'స్త్రీ, భేడియా, ముంజ్యా' లాంటి హారర్ చిత్రాలతో నిర్మాతగా వరుస విజయాలను దక్కించుకున్న దినేశ్ విజన్ గ్రామీణ



నేపథ్యంలో 'వాంపైర్స్ ఆఫ్ విజయ్ నగర్' పేరుతో ఓ హారర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానా కథానాయకుడిగా నటిస్తున్నారు. ఆయనకు జోడీగా రష్మికను ఎంపిక చేశారని అక్కడి పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే అధికారిక ప్రకటన వస్తేనే ఈ కాంబినేషన్‌పై స్పష్టత వస్తుంది. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. రష్మిక ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2: ది రూల్', సల్మాన్‌ఖాన్ 'సికందర్' చిత్రాల్లో నటిస్తున్నారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ




ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

డివోషనల్ థ్రిల్లర్



ఆది సాయికుమార్, ఆవికా గోర్ జంటగా రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. ఇంతకుముందు 'శాసనసభ' చిత్రాన్ని నిర్మించిన తులసీరామ్ సాప్పని, షణ్ముగం సప్పని, రమేశ్ యాదవ్ ఈ సినిమాకు నిర్మాతలు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపుదిద్దుకుంటున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా ఉంటుంది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో చివరి షెడ్యూల్ పూర్తయింది. రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. హీరో ఆది కెరీర్‌లో ఓ మైలు రాయిగా నిలిచిపోతుంది' అని చెప్పారు.

అజర్ బైజాన్‌లో అజిత్ యాక్షన్



తమిళ హీరో అజిత్ కుమార్ మరోసారి తనలోని యాక్షన్ కోణాన్ని సరికొత్తగా చూపించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 'విడాముయార్చి' చిత్రం తాజా షెడ్యూల్ అజర్ బైజాన్‌లో మొదలైంది. 45 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పతాక సన్నివేశాల్లో భాగంగా భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను అక్కడ చిత్రీకరించనున్నారు. మంగళవారం మేకర్స్ షూటింగ్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ప్రమాదకరమైన స్టంట్స్‌లోనూ అజిత్ డూప్‌ను వాడడం లేదు అని చిత్రబృందం తెలిపింది. తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయిక. అర్జున్ సర్జా, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.

ఎస్.. బాస్..
షూటింగ్ పూర్తయింది



'రాక్షసుడు', 'ఖిలాడీ' వంటి చిత్రాలను అందించిన నిర్మాత, కె.ఎల్ యూనివర్సిటీ ఛైర్మన్ కోనేరు సత్యనారాయణ నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఎస్..బాస్'. మంగళవారం చిత్ర కథానాయకుడు హవీస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఆయన స్టైలిష్ లుక్ విడుదల చేశారు. 'భాగమతి' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు అశోక్ పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకుంటున్న 'ఎస్ బాస్' షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రానికి కథ, మాటలు: ఆకుల శివ, సంగీతం: అనూప్ రూబెన్స్, ఫొటోగ్రఫీ: కబీర్‌లాల్.